క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ అన్నార్తులను ఆదుకోవాలి



పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న యువకులు

సామర్లకోట: ఆకలితో ఉన్న వారిని ఆదుకోవడానికి తమ వంతు సాయం చేయాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దేవగురు చంద్రశేఖర్ అన్నారు. తన స్నేహితులతో కలిసి ఆయన ఓ నిరుపేద కుటుంబానికి తన వంతు సాయం అందజేశారు. స్థానిక కోటపేటకు చెందిన ఝాన్సీ అనే మహిళకు నెలకు సరిపడా నిత్యావసర సరకులను సోమవారం అందజేశారు. ఆమె భర్త ఇటీవల మరణించడంతో, ఇద్దరు పిల్లలతో ఆమె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి సాయం అందించారు.

నేటి నుంచి అధికారులకు శిక్షణ

సామర్లకోట: వివిధ జిల్లాలకు చెందిన అధికారులకు స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మంగళవారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్టు ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం, మన్యం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల అధికారులకు ఐదు బ్యాచ్‌లలో శిక్షణ పూర్తి చేసినట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం 9 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను గుర్తించి, వాటిపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు ఆరో బ్యాచ్‌లో స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలున్న గ్రామం అనే అంశంపై శిక్షణ ఉంటుందని చెప్పారు. సెప్టెంబరులో మరో మూడు అంశాలపై మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఉంటుందని, దీంతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణ పూర్తి అవుతుందన్నారు. శిక్షణ పొందిన జిల్లా స్థాయి అధికారులు ఆయా మండలాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు.

'లక్ష్య' సొసైటీ సేవలకు జాతీయ అవార్డు



విజయవాడలో అవార్డు అందుకుంటున్న శివారెడ్డి

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లికి చెందిన లక్ష్య చారిటబుల్ సొసైటీ సేవలకు సోమవారం జాతీయ మదర్ థెరిసా అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో జరిగిన మదర్ సర్వీసు సొసైటీ రెండో వార్షికోత్సవంలో లక్ష్య చారిటబుల్ సంస్థ ఫౌండర్ శివారెడ్డికి నిర్వాహకులు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ చేసిన సేవలను గుర్తించి అవార్డు ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

అన్నదానానికి రూ.20 వేల విరాళం



విరాళం రసీదును అందుకుంటున్న దంపతులు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానం పథకానికి సామర్లకోటకు చెందిన గోలి రామచంద్రరావు, రామలక్ష్మి దంపతులు రూ.20,116 విరాళంగా అందజేశారు. సోమవారం రాత్రి స్వామివారి దర్శనానికి వచ్చిన దంపతులు ఆలయంలో జరుగుతున్న అన్నదానం తెలుసుకుని, ఆలయ సీనియర్ అసిస్టెంట్‌కు విరాళం అందజేశారు. వారికి ఆలయ సిబ్బంది ఆన్‌లైన్ రసీదును అందజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కాకినాడ లీగల్: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని సబ్ జైలు ఉద్యోగి అనిశెట్టి శుభకర్ రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన సోమవారం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేశారు. ఈయన ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కాకినాడ స్పెషల్ సబ్ జైల్లో ఆయన వార్డర్‌గా పనిచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల అనేక మందిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ఆయన తెలిపారు. యువత మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, సమాజానికి ఉపయోగపడాలని కోరారు. రక్తదానం చేసిన శుభకర్ రెడ్డిని ఫ్రెండ్స్ ఫౌండేషన్ అధినేత కూనిశెట్టి మణికంఠ రెడ్డి, పలువురు ఉద్యోగులు అభినందించారు.

మహిళల్లో భయాందోళనలు తొలగించాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటనతో మహిళలు, మహిళా ఉద్యోగుల్లో భయం పెరిగిపోయింది. మహిళా ఉద్యోగుల భయాందోళనలు తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. ఆసుపత్రుల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. డాక్టర్లకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ వై.శ్రీహిమవతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వేట్లపాలెం, సామర్లకోట

శిక్షలు కఠినంగా ఉండాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన దేశాన్ని కలచివేసింది. విధి నిర్వహణలో మహిళలకు భద్రత లేకపోతే కష్టం. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలి. వైద్యుల రక్షణకు ప్రత్యేకమైన చట్టాలు చేసి పకడ్బందీగా అమలు చేయాలి.

రాజ్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్, కొమరగిరి

ముకుందా.. మురారి..!

- కన్నులపండువగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గ్రామాల్లో ఉత్సాహంగా ఉట్టికొట్టు సంబరాలు

పిఠాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో కన్నులపండువగా జరిగాయి. గ్రామాల్లోని ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని పిల్లలు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పలు ఆలయాల వద్ద సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో వేంచేసిన శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పిఠాపురం మంగయమ్మరావుపేటలో వేంచేసిన లక్ష్మీ గణపతి సహిత కృష్ణాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేష అలంకరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆలయానికి వచ్చి భక్తులకు కనువిందు చేశారు. పట్టణంలో పలు కృష్ణుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో శ్రీకృష్ణునికి అర్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పిఠాపురంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నుంచి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు తెలిపారు. ఈ నెల 29 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 27న కృష్ణాష్టమి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర పుష్పార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న ఉదయం 8 గంటలకు మాస కల్యాణం, రాత్రి 7 గంటలకు ఉట్టుకొట్టు సంబరం, గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పిఠాపురంలో ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

అలరించిన వేషధారణలు


కొత్తపల్లి: మండలవ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తపల్లి, యండపల్లి, కొండెవరం తదితర గ్రామాల్లోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. చిన్నారుల చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు చోట్ల ఉట్టి కొట్టు కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఆట పాటలతో చిన్నారులు అలరించారు. ఉప్పాడ బీచ్‌రోడ్డులోని వాటర్ ట్యాంక్ పక్కన రామాలయం వద్ద శ్రీకృష్ణ ధర్మరక్ష ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పిఠాపురంలో కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కొండెవరంలో విద్యుత్ దీపాలంకరణ నడుమ వేణుగోపాలస్వామి ఆలయం



ఉప్పాడలో ఉట్టి కొడుతున్న భక్తులు



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో గోపూజ నిర్వహిస్తున్న ఈఓ సౌజన్య

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



సామర్లకోటలోని రాధా సమేత వేణుగోపాలస్వామి



సామర్లకోటలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సామర్లకోట: కృష్ణాష్టమి వేడుకలు పట్టణ, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత సామర్లకోటలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పెద్దాపురం రోడ్డులోని రాధా వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. కౌన్సిలర్ నమ్మి సూర్యదుర్గ, ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, దారబాల సూరిబాబు, మార్ల సూర్యనారాయణ, మార్ల రాంబాబు, నమ్మి అప్పారావు భక్తులకు సేవలందించారు. మంగళవారం ఈ వేడుకలు ముగుస్తాయి. అలాగే బ్రౌన్‌పేట కృష్ణుని ఆలయం వద్ద కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్థానిక చిన్నవీధిలోని రామాలయంలో సానిపిని హరి ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

పెద్దాపురం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పెద్దాపురం: కృష్ణాష్టమి వేడుకలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి గుడి వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణ వైభోత్సవంలో ఆర్డీఓ జేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అర్బన్, ఆయా గ్రామాల్లో ఉన్న వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ గురువు గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీతాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ఏఓ వేణు తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోట నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న కృష్ణాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై ఆశీనులై, రుక్మిణీ కల్యాణం జరిపించారు. అనంతరం ఉట్టి కొట్టు కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.



శాంతివర్ధన పాఠశాలలో ఉట్టి కొడుతున్న విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు



గుడివాడ కృష్ణాష్టమి వేడుకల్లో అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: శ్రావణ మాసం సోమవారం పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామికి తొలి అభిషేకం, తొలి పూజను పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో నిర్వహించారు. తొలి అభిషేకం, పూజలను తిలకించడానికి తెల్లవారుజామున భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి నీటితోను, పాలతోను స్వయంగా అభిషేకాలు చేశారు. ధ్వజ స్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూల విరాట్లతో పాటు స్వామివారిని, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. వేద పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు వినయ్, సత్యనారాయణమూర్తి, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన జేసీ

పెద్దాపురం: ఏడీబీ రహదారిలో పెద్దాపురం వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సోమవారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వల వివరాలు, పంపిణీ ఏ విధంగా జరుగుతోంది, రవాణా చార్జీలు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక విధానాన్ని నిర్వహిస్తోందన్నారు. అందరికీ అందుబాటులో ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్ వద్ద ఏడు వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జేసీ తెలిపారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ భావన, డీటీ కాంతారావు తదితరులున్నారు.



పెద్దాపురంలో ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జేసీ మీనా

స్థలాల లీజుపై 28న సమావేశం

కాకినాడ సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ కాకినాడ డిపో పరిధిలోని పెద్దాపురం, కాకినాడ, సామర్లకోట, పిఠాపురం బస్ స్టేషన్లలో ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల కాల పరిమితికి టెండర్లు పిలిచినట్టు డిపో మేనేజర్ మనోహర్ సోమవారం తెలిపారు. బిడ్‌పై వివరణ కోసం ఈ నెల 28న రాజమహేంద్రవరంలో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఉదయం 11.30కు జరిగే సమావేశానికి హాజరై, పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

మహిళా సాధికారతతో సమాజ పురోగతి

బోట్‌క్లబ్: ప్రతి మహిళ సాధికారత సాధించడం ద్వారా సమాజం పురోగతి సాధ్యమవుతుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో సోమవారం మహిళా సమానత దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో ఔన్నత్యమైందన్నారు. కుటుంబం బాగుండాలన్నా, దేశం ప్రగతి సాధించాలన్నా మహిళల వల్లే సాధ్యమవుతుందన్నారు. అటువంటి వారిపై జరుగుతున్న దారుణాలను నివారించేందుకు సమైక్య కృషి జరగాలన్నారు . సంఘ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను ప్రోత్సహించాలని, ప్రతిచోటా మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు, ఉన్నాయని తెలిపారు.

అన్నదాతకు సాగు పాఠాలు

- పొలంబడితో చేకూరుతున్న మేలు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- నిష్ణాతులుగా మారుతున్న రైతులు
- తగ్గిన ఎరువులు, రసాయన మందుల వినియోగం

కరప: రైతులకు సాగు వ్యయం తగ్గించి, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పొలంబడి కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, సాగులో మెళకువలను ఆకళింపు చేసుకుంటూ రైతులు నిష్ణాతులుగా మారుతున్నారు. పొలంబడి ద్వారా తాము నేర్చుకున్న సాగు పాఠాలను ఇతర రైతులకు చెప్పగలుగుతున్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో పొలంబడి నిర్వహించేందుకు రెండు గ్రామాలను ఎంపిక చేశారు. కరప మండలంలో కొరిపల్లి, కాకినాడ రూరల్ మండలంలో నేమాం గ్రామాన్ని ఎంపిక చేసి, ప్రతి వారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహిస్తోంది. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నదే పొలంబడి ముఖ్యోద్దేశం.

రైతులు భాగస్వాములుగా..

ఎంపిక చేసిన గ్రామంలో 30 నుంచి 45 ఎకరాల్లో 30 మంది రైతులను భాగస్వాములను చేసి, వ్యవసాయ శాఖాధికారులు, వీఏఏలు, ఏఈఓలు ప్రతి వారం రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ప్రతి వారం రైతులను సమావేశపరిచి, ఎప్పటికప్పుడు పంటలో వచ్చే వివిధ మార్పులను సమగ్రంగా పరిశీలించి, వాటిపై చర్చించి, అనుసరించాల్సిన సాగు పద్ధతులు, సమగ్ర పంటల యాజమాన్య విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఇందులో పర్యావరణ హితమైన, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు ఆచరింపజేస్తారు. సాగు ఖర్చు తగ్గించి, నాణ్యమైన పంట ఉత్పతులు పెంచడంపై దృష్టి సారిస్తారు. ఈ కార్యక్రమం పూర్తిగా పొలంలోనే 14 వారాల పాటు నిర్వహిస్తారు.

వివిధ పద్ధతులపై అవగాహన

మట్టి నమూనా పరీక్షలు, విత్తనశుద్ధి నుంచి నారుమడి పెంపకం, దమ్ములు, వరినాట్లు, ఎరువులు, పురుగు మందుల వాడకం, నీటి యాజమాన్య పద్ధతులు వివరిస్తారు. ఏ సమయాల్లో ఎరువులు ఎంత మోతాదులో, ఎలా వాడాలో వివరిస్తారు. పంటలో ఉండే శత్రు, మిత్ర పురుగులపై వివరిస్తారు. ఏ సమయాల్లో పంట తెగుళ్లు వస్తాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా వివరిస్తారు.

సాగు చేస్తూ.. శిక్షణ పొందుతూ..

పొలంబడిలోని రైతులు వ్యవసాయం చేస్తూ, శిక్షణ పొందడం ప్రత్యేకత. వీఏఏ టి.స్వర్ణతేజ రైతులను చైతన్యపరిచి ప్రతి వారం రైతులు పొలంబడిలో సమావేశపరుస్తారు. ఆ వారంలో చేసిన పనులు, జరిగిన కార్యకలాపాలపై, వరిచేను ఎదుగుదల, పంట తెగుళ్లు ఏమైనా ఉన్నాయా అని చర్చిస్తారు. రైతులు తమ అనుభవాలను తెలుపుతారు. తర్వాత క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి పంట పరిస్థితిని, తెగుళ్లకు కారణాలను వ్యవసాయాధికారులు వివరిస్తారు. ప్రధానంగా మొక్కల ఆరోగ్యం, వాతావరణం, భూమిలోని తేమ, కలుపు మొక్కల సాంద్రత, భూమిలోని పోషక పదార్థాల యాజమాన్యం, తెగుళ్లు, కీటకాలు, అవి చేసే హాని లక్షణాలు, మిత్ర కీటకాల ఉనికి, వాటి సంఖ్య డ్రాయింగ్ పేపర్‌పై రాసి, సమగ్రంగా చర్చిస్తారు. అవసరమైన మేరకు ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారు. పొలంబడిలో రైతులు బృందంగా సమావేశం కావడం వల్ల వారిలో ఐకమత్యం, స్ఫూర్తి, నాయకత్వం, సమర్థంగా వనరుల వినియోగానికి, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. డ్రోన్లతో రసాయనాలు, ఎరువుల పిచికారీ, ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తారు.



డ్రోన్ సాయంతో ఎరువులు, రసాయనాల పిచికారీని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

చాలా ప్రయోజనకరంగా ఉంది



నేను 3.20 ఎకరాలు సాగు చేస్తున్నాను. సొంత భూమి ఒక ఎకరం, మిగిలింది కౌలుకు తీసుకున్నాను. పొలంబడి వల్ల చాలా నేర్చుకుంటున్నాం. సాగు ఖర్చు తగ్గించుకుని, దిగుబడులు పెంచుకునేలా ప్రతి వారం వ్యవసాయాధికారులు మెళకువలు వివరిస్తున్నారు. మేము నేర్చుకున్న పద్ధతులు ఇతర రైతులకు కూడా చెప్పగలుగుతున్నాం. పొలంబడి రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటోంది.

– దెయ్యాల రాంబాబు, రైతు, కొరిపల్లి

ఆధునిక పద్ధతుల్లో సాగు శిక్షణ



ఈ ఏడాది కరప మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి జీఏపీ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టికల్) పొలంబడి నిర్వహిస్తున్నాం. ప్రతి బుధవారం కొరిపల్లిలో రైతులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయంలో అనుసరించే ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, సాగు మెళకువలు వివరిస్తున్నాం. వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు ప్రతి వారం పొలంబడి నిర్వహించే గ్రామాల్లో రైతులకు అనుసరించాల్సిన పద్ధతులు వివరిస్తున్నాం. మైక్రో న్యూట్రిషన్ల లోపాలను తగ్గించేందుకు ప్రకృతి రసాయనాల ఆధారంగా తయారు చేసిన న్యూట్రిషన్ల వాడకం, ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేయడం వంటివి చేస్తున్నాం. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.

– ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం